క్లుప్తంగా

పదవీ విరమణ వయస్సు పెంపు హర్షణీయం



మైలవరం: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పదవీ విరమణ వయస్సును ప్రభుత్వం పెంచడం హర్షణీయమని పీఆర్‌టీయూ మైలవరం మండల శాఖ అధ్యక్షుడు పి. గోపాల్ అన్నారు. దానికి అనుగుణంగా డిపార్టుమెంట్ పరీక్షలు ఆన్‌లైన్ విధానం వచ్చిందని, 60 సంవత్సరాలు నిండిన ఉపాధ్యాయులకు ఈ పరీక్షల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి. కల్పలతను కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశామని చెప్పారు.

నేడు నూతన భవనాల ప్రారంభోత్సవం

జి.కొండూరు/మైలవరం: గడ్డమణుగు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ భవనాలను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సోమవారం ప్రారంభిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి. అలాగే చెవుటూరు గ్రామ సచివాలయ నూతన భవనాన్ని ప్రారంభిస్తారని, అనంతరం నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొంటారని పేర్కొన్నారు.

- ఇబ్రహీంపట్నం: మండలంలోని మూలపాడులో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, సామాజిక భవనంతో పాటు కొండపల్లి 29వ వార్డులో నిర్మించిన నూతన కమ్యూనిటీ భవనాన్ని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ సోమవారం ప్రారంభిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

కాపు సంఘం నేతల హర్షం

మైలవరం: మెగాస్టార్ చిరంజీవికి పద్మ విభూషణ్ అవార్డు ప్రదానం చేయడం హర్షణీయమని మైలవరం నియోజకవర్గ కాపు సంఘం నాయకులు కఠారి ఉమామహేశ్వరరావు అన్నారు. చిరంజీవికి పద్మ విభూషణ్ అవార్డు ప్రకటించిన సందర్భంగా మైలవరంలో పార్టీలకు అతీతంగా కాపు సంఘం ఆధ్వర్యంలో స్థానిక రంగా విగ్రహం వద్ద ఆదివారం నాయకులు కేక్ కట్ చేశారు. మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు కఠారి ఉమామహేశ్వరరావు, మైలవరం ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ నాగులూరి ఆజాద్, కో–ఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షుడు నాగులూరి దుర్గాప్రసాద్, శీలం బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి ఆపైన విద్యార్హత కలిగిన వారికి ప్రత్యేకంగా బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తామని కళాశాల ప్రిన్సిపాల్ ఇళ్ల రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కోర్సు రెండు నెలల పాటు ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు ఫిబ్రవరి 4వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు పదో తరగతి మార్కుల జాబితా, అధార్ కార్డు, ఈ మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్ జత చేయాలన్నారు ఇతర వివరాలకు సెల్: 82477 66718, 94906 35936 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



విస్సన్నపేట: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల అసోసియేషన్ విస్సన్నపేట సమితి యూనిట్ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగింది. సమితి యూనిట్ అధ్యక్షుడుగా జి. జగదీష్, ఉపాధ్యక్షుడుగా ఎం. నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా వైవీ నరసింహం, సంయుక్త కార్యదర్శిగా కె. రవీంద్ర, కోశాధికారిగా సీహెచ్ సురేష్, జిల్లా కౌన్సిలర్లుగా సీహెచ్ ప్రసాద్, పి. నవ్య ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా యు. రామకృష్ణ, పరిశీలకులుగా కె. సాయిరామ్, అసోసియేషన్ జిల్లా కన్వీనర్‌గా జేఎల్ ప్రసాద్ వ్యవహరించారు.

బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



తిరువూరు: ఏపీ బీసీ సంక్షేమ సంఘం తిరువూరు పట్టణ అధ్యక్షుడిగా మల్లెల శ్రీనివాసరావు నియమితులయ్యారు. రాష్ట్ర సంఘం అధ్యక్షుడు కేశన శంకర్రావు ఈ నియామకం జరిపారని నియోజకవర్గ అధ్యక్షుడు మీనుగు శ్రీనివాసరావు తెలిపారు. సంఘ నాయకులు కందిమళ్ళ శేషగిరిరావు, పర్వతం శ్రీనివాసరావు, ఆర్‌ఆర్‌కే చారి, వాకదాని లక్ష్మీనారాయణ, పి. శ్రీను తదితరులు ఆయనను అభినందించారు.

వలస కూలీలకు ఉపాధి

- మహారాష్ట్ర నుంచి 8 వేల మందికి పైగా కూలీల రాక
- కుటుంబాలతో సహా ఇక్కడే మిరప కోతలు
- ఖాళీ పొలాల్లోనే నివాసం



ఊటుకూరులో మిరప కోత కోస్తున్న మహారాష్ట్ర కూలీలు

గంపలగూడెం: మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన కూలీలకు నియోజకవర్గంలోని మిరప తోటలు ఉపాధి చూపుతున్నాయి. గత ఎనిమిదేళ్లుగా తిరువూరు నియోజకవర్గానికి సుమారు 8 వేల మందికి పైగా మహారాష్ట్ర నుంచి వలస కూలీలు వస్తున్నారు. ప్రతి ఏటా డిసెంబర్‌లో మిరప కోతల ప్రారంభంలో వచ్చే వీరు మార్చి నెలలో వచ్చే హోలీ పండగకు తిరుగు ప్రయాణం చేస్తారు. మహారాష్ట్రలోని మధ్యవర్తుల ద్వారా ఇక్కడ రైతులతో ఒప్పందం చేసుకొని వీరు పనిలోకి వస్తారు.

16 వేల ఎకరాల్లో మిరప సాగు

తిరువూరు నియోజవర్గంలోని నాలుగు మండలాల్లో 16 వేల ఎకరాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మిరప సాగు చేశారు. అత్యధికంగా గంపలగూడెం మండలంలో 9,885 ఎకరాలు, ఏకొండూరు మండలంలో 4,500 ఎకరాలు, తిరువూరు మండలంలో 1,700 ఎకరాలు, విసన్నపేట మండలంలో అత్యల్పంగా 215 ఎకరాల్లో సాగు చేశారు. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా తోటలకు నల్లి తెగులు సోకింది. మందుల రూపంలో అధికంగా పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. ఎకరానికి రూ.60 వేల నుంచి 75 వేల వరకు పెట్టుబడి పెట్టారు. ప్రతి మూడు రోజులకు ఒక పర్యాయం పురుగు మందులను వాడి పంటను రక్షించుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఎకరానికి 15 నుంచి 20 క్వింటాళ్ల లోపు పంట దిగుబడి వచ్చే అవకాశం ఉందని ఉద్యాన శాఖాధికారులు చెబుతున్నారు. కాపు సక్రమంగా ఉంటే మొదటి కోతకు అత్యధికంగా 15 క్వింటాళ్లు రావాల్సి ఉండగా ఈ ఏడాది 5 నుంచి 8 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు.

ముమ్మరంగా కోతలు..

కోతల తరుణంలో వలస కూలీలు గంపలగూడెం మండలంలోని ఊటుకూరు, దుందిరాలపాడు, తునికిపాడు, కొణిజెర్ల, ఆర్లపాడు, పెనుగొలను, గాదెవారిగూడెం, చింతలనర్వ, చల్లగుండ్లవారిపాలెం తదితర గ్రామాల్లో రోజూ మిరప కోత పనుల్లో ముమ్మరంగా పాల్గొంటున్నారు. కిలోల లెక్కన మిరప కాయల్ని కోసి, కిలో ఒక్కంటికీ రూ.10 నుంచి రూ.20 వరకు కూలీలు డిమాండ్ చేస్తున్నట్లు రైతులు వివరించారు. కాపు సరిగా ఉన్న పొలాల్లో కూలీలు రోజుకు సరాసరి రూ.500 కూలీ సొమ్ము పొందుతున్నారు. ఏడాదిలో 90 రోజులు కనీసంగా కూలీకి వచ్చి ఒక్కొక్కరు రూ.40 వేలకు పైగా సంపాదిస్తున్నట్లు తెలుస్తోంది.

మూడు నెలల్లో రూ. 80 వేల ఆదాయం

భార్యాభర్తలు కలిసి వస్తే తిరిగి వెళ్లే సమయానికి రూ.80 వేలకు పైగా కూలీ రూపంలో ఆదాయం పొందుతారని రైతులు తెలిపారు. ఈ సమయంలో మహారాష్ట్రలో పనులు లేకపోవడంతో ఇక్కడ మిరప కోత పనులు చేతినిండా దొరకడంతో ఉపాధి కోసం వారు ఇక్కడకు విచ్చేస్తున్నారు. వీరికి భాష రాకపోయినా పని చేయడంలో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించడం లేదని రైతులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. వారికి కావాల్సిన కనీస వసతులు మాత్రం కల్పించాల్సి ఉందంటున్నారు.

పొలాల్లోనే కూలీల నివాసం

మహారాష్ట్ర నుంచి వచ్చిన కూలీలు ఖాళీగా ఉన్న పొలాల్లోనే గుడారాలు వేసుకొని జీవనం సాగిస్తుంటారు. రైతులు వీరికి బియ్యం ఇస్తారు. కొందరు కుటుంబాలతో సహా ఇక్కడకు వచ్చి పనుల్లో పాల్గొంటున్నారు. తమకు ఇక్కడ చేతినిండా పని, రైతుల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని కూలీలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

తగిన పని దొరుకుతోంది



మహారాష్ట్ర నుంచి తాము ఇక్కడకు వచ్చి చేతి నిండా మూడు నెలలు పనిచేసుకొంటూ తగినంత కూలీ సంపాదించుకుంటున్నాం. రైతులు మంచిగా ఆదరిస్తున్నారు. నాలుగేళ్లుగా వస్తున్నాం. హోలీకి తిరిగి వెళతాం.

– సుందర్‌శంకర్ జింథే, వలసకూలీల ముఠా మేస్త్రి, మహారాష్ట్ర

భార్యతో కలిసి వచ్చా



మిరప కోతల పని లభిస్తుండటంతో భార్యభర్తలము ఇద్దరము వచ్చాం. ఆడుతూ,పాడుతూ పనిచేసుకొంటున్నాం. ఎలాంటి ఇబ్బందిలేదు. రోజుకు 40 కేజీల మిరప కాయలు ఒక్కొక్కరం కోస్తాం. కేజీకి రూ.10 నుంచి రూ. 20 వరకు ఇస్తున్నారు. సొంతూరులో పనిలేక ఇక్కడకు వస్తున్నాం.

– నీలిమ, గన్‌శ్యామ్ మరాఫే, వలసకూలీ దంపతులు, మహారాష్ట్ర

నమ్మకంగా పనిచేస్తున్నారు



మహారాష్ట్ర నుంచి ఇక్కడకు వచ్చే వలస కూలీలు నమ్మకం, మాటకు కట్టుబడి, కష్టపడి పనిచేస్తున్నారు. కాయకోతతోపాటు, ట్రాక్టర్‌కు లోడ్ చేయడం, కల్లాలో ఆరబెట్టడం చేస్తారు. కాయలు శుభ్రంగా కోస్తారు. వలసకూలీలకు మిరప కోతల్లో మంచి నైపుణ్యం ఉంది. గడచిన ఆరేళ్లుగా వస్తున్నారు.

– అలపాటి ఉమా, మిరప రైతు, పీఏసీఎస్ అధ్యక్షుడు, ఊటుకూరు

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యాలయంలో డివిజన్‌లోని ప్రజల నుంచి వారి సమస్యలపై అర్జీలను స్వీకరించి వాటిని గడువులోగా పరిష్కరిస్తామన్నారు.

త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం



తిరువూరు: స్థానిక చంద్రమౌళీశ్వరాలయ ప్రాంగణంలో ఆదివారం త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం మంగళవాయిద్యం, నాదస్వరం, వేదస్వస్తి అనంతరం త్యాగరాజ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్ధి బుద్ధి సమేత గణపతి కల్యాణం జరిపారు. చిత్రాల నారాయణ బృందం నాదస్వర కచేరీ, దేవి నిహారిక గాత్ర కచేరీ, గుడిపాటి జయరామ సుధాకర్ హరికథా గానం అలరించాయి. గత 70 ఏళ్లుగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని త్యాగరాజ గాన కళా సమితి కార్యదర్శి మురుకుంట్ల సీతారామలింగేశ్వరశర్మ తెలిపారు.

5న హుండీ కానుకల లెక్కింపు

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలోని భవానీ ముక్తేశ్వరస్వామి ఆలయ హుండీ కానుకలను ఫిబ్రవరి ఐదో తేదీ ఉదయం పది గంటలకు దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కించనున్నట్లు ఈఓ జయప్రకాష్‌బాబు ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు మహాశివరాత్రి సందర్భంగా కొబ్బరి చిప్పల సేకరణ, లడ్డుప్రసాదాల హక్కులకు సంబంధించి బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు పాల్గొనాలని ఆయన కోరారు.

సంపూర్ణ ఆరోగ్యానికి క్రీడలు దోహదం

తిరువూరు జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్



వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న జడ్జి మోతీలాల్

తిరువూరు: శారీరక, మానసికోల్లాసానికి ప్రతి ఒక్కరూ క్రీడల్లో ప్రావీణ్యం సాధించాలని, సంపూర్ణ ఆరోగ్యానికి క్రీడలు దోహదం చేస్తాయని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి మోతీలాల్ అన్నారు. స్థానిక షిర్డీ సాయి కల్యాణ మండపంలో ఎన్టీఆర్ జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువకులు దేహదారుఢ్యాన్ని పెంపొందించుకునేందుకు పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ సాధన చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడాకారులకు ఉద్యోగాల భర్తీలో ప్రత్యేక రిజర్వేషన్లు అమలు చేస్తున్నందున యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తిరువూరు సీఐ అబ్దుల్ నబీ, ఎస్‌ఐ పద్మారావు, పోటీల నిర్వాహకులు మల్లేశ్వరరావు, నరేంద్ర, మారెళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ పంపింగ్ స్కీమ్‌లో ఎన్టీటీపీఎస్ బూడిద నీరు కలవడంతో తాగునీటి సరఫరాలో అవాంతరాలు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు మున్సిపాల్టీ అధికారులు ఆదివారం ట్యాంకర్ల ద్వారా వివిధ ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేశారు. మున్సిపాల్టీ ట్రాక్టర్లతో పాటు ఇటీవలి కాలంలో ఎంపీ కేశినేని నాని మున్సిపాల్టీకి అందిజేసిన ట్యాంకర్లను ఉపయోగించి తాగునీటిని సరఫరా చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. తాగునీటి సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టామని ఆయన చెప్పారు.

కట్టలేరు వద్ద ధ్వంసమైన వంతెన పరిశీలన



ధ్వంసమైన వంతెన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అయోధ్య రామిరెడ్డి, కేశినేని నాని, స్వామిదాసు

కట్టలేరు(గంపలగూడెం): మండలంలోని ప్రధాన నీటి వనరైన కట్టలేరుపై హైబ్రిడ్జి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25.60 కోట్లు మంజూరు చేసిన నేపథ్యంలో వంతెన నిర్మించే ప్రాంతాన్ని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, విజయవాడ పార్లమెంటరీ, తిరువూరు శాసన సభ నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జ్‌లు కేశినేని నాని, నల్లగట్ల స్వామిదాసు ఆదివారం పరిశీలించారు. 2018లో అధిక వర్షాలకు కట్టలేరు వంతెన ధ్వంసమైంది. ఈ నేపథ్యంలో గత ఏడాది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరువూరు పర్యటన సందర్భంగా హైబ్రిడ్జి నిర్మాణానికి నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ప్రభుత్వం సంబంధిత నిధులను మంజూరు చేసింది. వచ్చే నెల 3వ తేదీన వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీని నమ్మేస్థితిలో ప్రజలు లేరు

ఎమ్మెల్సీ అరుణకుమార్



టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం కంచికచర్ల మండలం పేరకలపాడు గ్రామానికి చెందిన యువకులు తెలుగుదేశంపార్టీని వీడి ఎమ్మెల్సీ అరుణకుమార్ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సొంగా రాజేష్, బురదగుంట విజయ కృష్ణ, దోమా గోపి, నాగేంద్రబాబు, ప్రేమ్ కుమార్, కోటేష్‌లతోపాటు పార్టీలో చేరిన పలువురు యువకులకు అరుణకుమార్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్ మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీని నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే తమకు మంచి జరిగిందని, భవిష్యత్తులో కూడా జరుగుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారని వివరించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ఎంత అసత్య ప్రచారం చేసినా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలంతా వైఎస్సార్ సీపీ వెంటే ఉన్నారనే విషయం రానున్న ఎన్నికల్లో మరోసారి రుజువవుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో 2019కు మించిన భారీ విజయాన్ని అందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. నందిగామ నియోజకవర్గంలో సైతం పార్టీ నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితో రెండోసారి వైఎస్సార్ సీపీ అభ్యర్థిని గెలిపించుకుంటారన్నారు. పార్టీలో చేరినవారు రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.

పేకాట శిబిరంపై దాడి



ముసునూరు: పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం.. కాట్రేనిపాడులో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శనివారం రాత్రి ఎస్‌ఐ సిబ్బందితో కలిసి దాడిచేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.22,000 నగదు, 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీరిలో ఐదుగురు కాట్రేనిపాడుకు చెందినవారు కాగా, ఒకరు గోపవరం, ఒకరు ముసునూరుకు చెందిన వారు. వీరిని సోమవారం నూజివీడు కోర్టుకు హాజరుపరుస్తారు.

పేదల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం

మేయర్ రాయన భాగ్యలక్ష్మి



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, అడపా శేషు

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. కృష్ణలంకలోని ఏపీఎస్‌ఆర్ఎంసీ హైస్కూల్ ఆవరణంలో ఆదివారం కాపు కార్పొరేషన్ చైర్మన్, 20వ డివిజన్ కార్పొరేటర్ అడపా శేషు ఆధ్వర్యంలో సెంటినీ హాస్పిటల్ యాజమాన్యం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మేయర్ భాగ్యలక్ష్మి పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించి వైద్య పరీక్షలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పెంచిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, ఆర్థో, ఊపిరితిత్తులు, కిడ్నీ, నరాలు, జీర్ణకోశ, గుండె సంబంధిత వ్యాధులు, స్త్రీల సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్య సేవలు అందించారన్నారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 21వ డివిజన్ కార్పొరేటర్ పుప్పాల కుమారి, దేవినేని అవినాష్ బావ వై.సిద్ధార్థ్, వైద్యులు ఎస్.అనిల్, దోనె ఇందిర, కె.హరీష్, వైఎస్సార్ సీపీ నాయకులు పల్లెం రవి, నిమ్మల జ్యోతిక, సురేష్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.41వేల విరాళం

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలోని వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి పలువురు భక్తులు రూ. 41,856లను విరాళంగా అందించారని ఆలయ చైర్మన్ రవీంద్ర భరద్వాజ్ ఆదివారం తెలిపారు. 12 మంది భక్తులు విరాళాలు అందించారని ఆయన వివరించారు. దాతలకు స్వామి వారి ప్రసాదాలు, చిత్ర పటాలు అందజేసి సత్కరించారు.

● స్మృతివనం.. కోలాహలం

విజయవాడలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ స్మృతివనం సందర్శకులతో కోలాహలంగా మారింది. ఆదివారం సెలవు కావడంతో పెద్ద సంఖ్యలో సందర్శకులు వచ్చారు. స్మృతివనంలోని అంబేడ్కర్ జీవిత విశేషాల దృశ్యాలు, ఫౌంటెన్లు తదితరాలను ఆసక్తిగా తిలకించారు. ఆయా దృశ్యాలను వీక్షించి, తమ సెల్‌ఫోన్లలో బంధించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









నడకతో ఆరోగ్యకర జీవనం



ఎమ్మెల్యే వెలంపల్లిని సత్కరిస్తున్న నిర్వాహకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నడకతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్– 202 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం పాతబస్తీలోని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆవరణలో ఆదివారం జరిగింది. క్లబ్ గవర్నర్‌గా న్యాయవాది చిన్నం రామకృష్ణ, జిల్లా కార్యదర్శిగా కేవీ సూరిబాబు, కోశాధికారిగా జి.మురళీకృష్ణ వారి క్యాబినెట్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వెలంపల్లి వారికి క్లబ్ తరఫున హెల్త్ కార్డులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వాకర్స్ అసోసియేషన్లను ఏర్పాటు చేసి సామాజిక కార్యక్రమాలను నిర్వహించటం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. చిన్నం రామకృష్ణ మాట్లాడుతూ.. డిస్ట్రిక్ట్ 202 పరిధిలో సుమారు 200 క్లబ్‌లు, 9 వేల మంది సభ్యులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు మురళీమోహనరావు, ఆడిటర్ పెనుగొండ సుబ్బరాయుడు, క్లబ్ ప్రముఖులు తొండెపు హనుమంతరావు, సీహెచ్ మన్మథరావు, న్యాయవాదులు కోట జయరాజు, ఏవీ రమణ తదితరులు ప్రసంగించారు.

పౌష్టికాహారం పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడుకు చెందిన హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేద, హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పౌష్టికాహార పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, మల్లిక మాట్లాడుతూ నిరుపేద, హెచ్‌ఐవీ బాధిత చిన్నారులు పౌష్టికాహార లేమితో బాధపడుతు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నామని తెలిపారు.